




## ఏడాదిలోనే కాంగ్రెస్‌పై వ్యతిరేకత

- రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి సత్యవతి

కేసముద్రం, ఏప్రిల్ 11: కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏడాదిలోనే వ్యతిరేకత పెరిగి మళ్లీ బీఆర్‌ఎస్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎల్కతుర్తిలో నిర్వహించే బారీ బహిరంగసభకు కార్యకర్తలు, నాయకులు భారీగా జనసమీకరణ చేయాలని సూచించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత 50 సార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చారని, వాళ్ల హైకమాండ్ ఢిల్లీ పెద్దలని, వాళ్లు చెప్పినట్టే వినాలని తెలిపారు. కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలే హైకమాండ్ అని, తెలంగాణ ప్రజల ఆలోచనలకు అనుగుణంగానే కేసీఆర్ పరిపాలన చేశారని గుర్తుచేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. పాలకవర్గం లేకపోవడంతో కేంద్రం నిధులు ఆగిపోయాయని చెప్పారు. ఇప్పటి వరకు రూ.లక్షా 62 వేల కోట్లు అప్పు తెచ్చిన రేవంత్‌రెడ్డి ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ ఓలం చంద్రమోహన్, రావుల శ్రీనాథ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి. చిత్రంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, వొడితల సతీశ్‌బాబు

# చరిత్రాత్మకంగా ఎల్కతుర్తి మహాసభ

- కాంగ్రెస్ పాలనలో స్కీమ్‌లు లేవు.. స్కామ్‌లే
- తెలంగాణ ఆత్మగౌరవం ఢిల్లీకి తాకట్టు
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి


వరంగల్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ చారిత్రక ఘట్టంగా నిలుస్తుందని శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటేనే 'స్కామ్‌లు ఫుల్.. స్కీమ్‌లు నిల్' అని విమర్శించారు. శుక్రవారం బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కార్ తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూముల వేట చేస్తున్నదని.. లగచర్ల, కంచ గచ్చిబౌలి, హైడ్రాతో ఆ పార్టీ చేస్తున్న అరాచకాలు ప్రజలకు తెలిసిపోయాయని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో నిర్వహించిన వరంగల్ సింహగర్జన దేశంలోనే పెద్ద సభ అని ఆ కార్యక్రమానికి వచ్చిన మాజీ ప్రధాని దేవగౌడ ప్రశంసించారని గుర్తుచేశారు. రజతోత్సవ మహాసభ కూడా చరిత్రలో నిలిచిపోతుందని స్పష్టంచేశారు.

**కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం: ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు**

కాంగ్రెస్ 16 నెలల పాలనను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, కేసీఆర్ పాలనలోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని భావిస్తున్నారని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పేర్కొన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని అధికార పార్టీ ప్రజాప్రతినిధులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూములు ఇస్తున్నారని, బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో ఉన్న ఆదరణకు ఇదే నిదర్శనమని చెప్పారు. ఎల్కతుర్తిలో నిర్వహించనున్న మహాసభ నిర్వహణపై ఎప్పటికప్పుడు కేసీఆర్, కేటీఆర్ దిశానిర్దేశం చేస్తున్నారని చెప్పారు.

**60 ఏండ్ల కలను సాకారం చేసిన మహనీయుడు కేసీఆర్ : వినయభాస్కర్**

తెలంగాణ ప్రజల 60 ఏండ్ల ఆకాంక్షను సాకారం చేసి, కొత్త రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చిన మహనీయుడు కేసీఆర్ అని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. గాంధీ మార్గంలో ఉద్యమం నడిపించి.. అంబేద్కర్, పూలే ఆలోచనా విధానంలో పేదలకు విద్య, వైద్యాన్ని అందించారని చెప్పారు. రజతోత్సవ సభ కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, వొడితల సతీశ్‌బాబు, మాజీ చైర్మన్లు సమ్మారావు, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రజతోత్సవ సభకు రూ.25 లక్షల విరాళం

### కేటీఆర్‌కు చెక్కు అందజేసిన పట్నం అవినాష్

షాబాద్/ హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు పట్నం అవినాష్‌రెడ్డి రూ.25 లక్షలు విరాళంగా ఇచ్చారు. శుక్రవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చెక్కు అందజేయగా ఆయన అభినందించారు. అనంతరం అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అడుగు జాడల్లో నడుస్తూ, కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డితోపాటు పార్టీ నాయకుడు పట్నం సురేందర్‌రెడ్డి, కార్యకర్తలతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## లక్షలాదిగా తరలివెళ్దాం

### సభను విజయవంతం చేద్దాం

### మాజీ మంత్రి ఎర్రబెల్లి



తొర్రూరు/కొడకండ్ల, ఏప్రిల్ 11 : బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పాలకుర్తి నియోజకవర్గం నుంచి లక్షలాదిగా తరలివెళ్లి విజయవంతం చేద్దామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలకేంద్రంలోని సాయి గార్డెన్, జనగామ జిల్లా కొడకండ్ల మండలకేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన రజతోత్సవ సభ సన్నాహక సమావేశాల్లో ఎర్రబెల్లి పాల్గొని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సభను విజయవంతం చేయడం ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కేసీఆర్ చేసిన మంచి పనులే పార్టీకి శ్రీ రామరక్ష అని, ప్రజలు బీఆర్‌ఎస్ సర్కారునే మళ్లీ కోరుకుంటున్నట్టు స్పష్టంచేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటుతుందని చెప్పారు.

## సభను విజయవంతం చేయాలి

### మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 11 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వనపర్తి జిల్లా నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఖిల్లాఘణపురంలో రజతోత్సవ సభకు సంబంధించి ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని కార్యకర్తలను తరలించేవిధంగా నాయకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి శ్రీధర్, విజయ్‌కుమార్, నందిమల్ల అశోక్ పాల్గొన్నారు.



భద్రాచలం నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులతో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, చిత్రంలో జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

## ఐదువేల మందితో కదులుదాం

### బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం:కొప్పుల



వెల్గటూర్/ధర్మపురి రూరల్, ఏప్రిల్ 11: ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రతి గ్రామం నుంచి 20 మంది చొప్పున.. నియోజకవర్గం నుంచి 5వేల మందితో వెళ్లి విజయవంతం చేద్దామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జగిత్యాల జిల్లా ధర్మపురిలో నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా, కొప్పుల ముఖ్య అతిథిగా హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఈ నెల 27న ఉదయం పార్టీ జెండాను ఆవిష్కరించి, ఆ తర్వాత బహిరంగ సభకు బయలుదేరాలని సూచించారు. కాంగ్రెస్ పాలన రాష్ట్ర ఏర్పాటుకు ముందున్న రోజులను గుర్తు చేస్తున్నదని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత విమర్శించారు.

## స్వచ్ఛందంగా తరలిరావాలి

### రజతోత్సవ సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



కొల్లపూర్ రూరల్, ఏప్రిల్ 11 : ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీరం మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రజలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే గంగుల, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ

# స్వల్ప వ్యవధిలోనే కాంగ్రెస్ పతనం

- రజతోత్సవ సభకు వచ్చేందుకు లక్షలాది జనం సిద్ధం
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): ఏడాదిన్నర స్వల్ప వ్యవధిలోనే కాంగ్రెస్ పతనమైపోయిందని, రేవంత్ పాలనను ప్రజలు చీదరించుకుంటున్నారని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో శుక్రవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్టీ రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలివచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి భారీ జన సమీకరణ జరుగుతున్నదని, జిల్లా నలుమూలల నుంచి ఎల్కతుర్తికి వెళ్లే వాహనాలకు రూట్ మ్యాపులు ఇస్తున్నామని చెప్పారు.

**కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి 1.50 లక్షల మంది తరలింపు: గంగుల**

రజతోత్సవ సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 1.50 లక్షల మందిని తరలిస్తున్నట్టు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టంచేశారు. ఇందుకోసం ఇప్పటికే 400 ఆర్టీసీ బస్సులు, 200 ప్రైవేట్ స్కూల్ బస్సులు, ప్రైవేట్ బస్సులు బుక్ చేసినట్టు తెలిపారు. అవి కూడా సరిపోకపోవడంతో మహారాష్ట్ర నుంచి కూడా బస్సులు బుక్ చేసుకున్నామని చెప్పారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం జిల్లాకు వచ్చి పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో జిల్లా పార్టీ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం లేదని, మానేరు రివర్ ఫ్రంట్ పనులను నిలిపివేశారని చెప్పారు. వచ్చే జూన్ వరకు పనులు పూర్తి చేసి రివర్ ఫ్రంట్‌లో నీళ్లు ఆగేలా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, కనుమల్ల విజయ, నాయకులు అక్బర్ హుస్సేన్, చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి సభకు దండు కట్టాలి

- 27న గ్రామాల్లో గులాబీ జెండాలు రెపరెపలాడాలి
- బీఆర్‌ఎస్ 'భద్రాచలం' సమావేశంలో ఎంపీ వద్దిరాజు

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ భద్రాచలం, ఏప్రిల్ 11: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు భద్రాద్రి జిల్లా నుంచి గులాబీ శ్రేణులు దండు కట్టాలని, ఆ రోజు గ్రామగ్రామాన గులాబీ జెండాలు రెపరెపలాడాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం భద్రాచలంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ నియోజకవర్గస్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నియోజకవర్గ శ్రేణులు శ్రమించి ఇక్కడి వ్యక్తిని పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. అనంతరం కొత్తగూడెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక కాంగ్రెస్ ప్రజల్లో పరువు పోగొట్టుకుంటున్నదని విమర్శించారు. రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభకు తరలిరావాలి

### కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



మద్దూర్, ఏప్రిల్ 11 : ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు కొడంగల్ నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మద్దూరులో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు సంబంధించి మద్దూర్, కొత్తపల్లి, గుండుమాల్ మండలాల బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించగా నరేందర్‌రెడ్డి హాజరై దిశానిర్దేశం చేశారు. అనంతరం పూలే జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మద్దూర్, కొత్తపల్లి బీఆర్‌ఎస్ మండలాల అధ్యక్షులు వంచర్ల గోపాల్, మధుసూదన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## పాలన చేతగాకనే అబద్ధపు ప్రచారాలు

- బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో వెలిగిపోయిన తెలంగాణ.. 16 నెలల కాంగ్రెస్ పాలనలో తేలిపోయింది
- మోసపూరిత హామీలపై ఎక్కడికక్కడ నిలదీయాలి
- మాజీ మంత్రి వేముల



మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల. చిత్రంలో బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 11: పాలన చేతగాక సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ వెలిగిపోగా, 16 నెలల కాంగ్రెస్ పాలనలో తలసరి ఆదాయంలో 14వ స్థానానికి, జీఎస్‌డీపీలో 11వ స్థానానికి పడిపోయిందని తెలిపారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై ఆర్టీసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో డిచ్‌పల్లిలో శుక్రవారం వేముల సమావేశమై మాట్లాడారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీయాలని సూచించారు. తలసరి ఆదాయంలో నాడు నంబర్‌వన్‌గా ఉన్న రాష్ట్రాన్ని రేవంత్‌రెడ్డి 14వ స్థానానికి తీసుకొచ్చారని విమర్శించారు. పింఛన్లు రూ.4 వేలు, మహిళలకు రూ.2,500, కల్యాణలక్ష్మి, తులం బంగారం, రూ.15 వేల రైతుభరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, నిరుద్యోగ భృతి, ఆడపిల్లలకు స్కూటీలు.. ఇలా అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ మెడలు వంచి హామీలు అమలు చేసేలా బీఆర్‌ఎస్ కార్యకర్తలు పోరాటం చేయాలని సూచించారు.

**రజతోత్సవ సభను విజయవంతం చేయాలి: బాజిరెడ్డి**

బీఆర్‌ఎస్ ఏర్పడి 25 ఏండ్లు అవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. 15న డిచ్‌పల్లిలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత రాజకీయాల పరిణామాలపై దిశానిర్దేశం ఉంటుందని, భారీగా తరలిరావాలని కార్యకర్తలు, ప్రజలను కోరారు.

## రజతోత్సవ సభ ఏర్పాట్లకు సమయం ఇవ్వరా?

మొదటిపేజీ తరువాయి...

ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొననున్నారని వివరించారు. ముందుగా దరఖాస్తు చేసుకున్నప్పటికీ పోలీసులు అనుమతి ఇచ్చే విషయంపై స్పందించడం లేదని, అందుకే హైకోర్టుకు రావాల్సివచ్చిందని చెప్పారు. చివరి సమయంలో అనుమతికి నిరాకరిస్తే పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణ కష్టతరం అవుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ 2001 ఏప్రిల్ 27న ఆవిర్భవించిందని, టీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్‌గా పేరుమారిందని వివరించారు. హనుమకొండకు 13 కిలోమీటర్ల దూరంలోని ఎల్కతుర్తిలో 1300 ఎకరాల స్థలంలో లక్షల మంది బీఆర్‌ఎస్ శ్రేణులతో నిర్వహించే సభకు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని, ఇలాంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ముందుగా పోలీసులు అనుమతి ఇవ్వకుండా కావాలని ఇబ్బందులకు గురిచేయడం దారుణమని అన్నారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం రాజ్యాంగంలోని 19(1)(బి) అధికరణానికి వ్యతిరేకమని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది స్పందిస్తూ, భారీ ఎత్తున బీఆర్‌ఎస్ నిర్వహించే సభకు అనుమతి ఇచ్చే విషయంలో పోలీసులు పరిశీలన చేయాల్సి వుందని అన్నారు. ఇంటెలిజెన్స్ నివేదికతోపాటు పార్కింగ్, శాంతిభద్రతలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నాకే అనుమతి ఇవ్వాల్సి వుంటుందని చెప్పారు. పిటిషనర్ సమర్పించిన వినతిపత్రంపై నగర పోలీసు కమిషనర్ మరికొన్ని వివరణలు, పత్రాలు కోరారని చెప్పారు. ఈ మేరకు నోటీసులు జారీ చేశారని తెలిపారు. వీటికి పిటిషనర్ గురువారం రాత్రే సమాధానం ఇచ్చారని, కౌంటర్ దాఖలు చేయడానికి మరింత గడువు కావాలని కోరారు. దీనిపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. బీఆర్‌ఎస్ శ్రేణులు పార్టీ సభకు ఏర్పాట్లు చేసుకోవడానికి తగిన సమయం కావాలి కదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. శాంతిభద్రతల సమస్య, ఇంటెలిజెన్స్ రిపోర్టును పరిగణనలోకి తీసుకొని అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని, దీనికి సంబంధించిన వివరాలు సేకరించడానికి సమయం పడుతుందని న్యాయవాది చెప్పారు. విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేయాలని కోరగా, అందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ నెల 17వ తేదీ వరకు సమయం ఇస్తున్నట్టు తెలిపింది. ఈలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రతివాదులైన హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వరంగల్ పోలీస్ కమిషనర్, కాజీపేట ఏసీపీలకు నోటీసులు జారీచేసింది.

## హైకోర్టు పేరిట నకిలీ ఉత్తర్వులు



### దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): నిజాంల కాలం నుంచి వివాదంలో ఉన్న భూములపై హక్కుల కోసం హైకోర్టు పేరుతో నకిలీ ఉత్తర్వులు సృష్టించడంపై ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇది న్యాయ పరిపాలనలో జోక్యం చేసుకోవడమేనని మండిపడింది. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని జ్యుడీషియల్ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ ఫిర్యాదుపై దర్యాప్తు నిమిత్తం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్)ను ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని భూముల మీద హక్కులపై మహమ్మద్ తాహెర్‌ఖాన్‌కు అనుకూలంగా సివిల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై హెచ్‌ఎండీయే అప్పీలు దాఖలుచేసింది. దీనిపై జస్టిస్ టీ వినోద్‌కుమార్, జస్టిస్ పీ శ్రీసుధతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే కోర్టు పేరిట నకిలీ ఉత్తర్వులు ఉన్నట్టు గమనించిన ధర్మాసనం విచారణకు ఆదేశించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న సీఎస్ 7/1958లో దరఖాస్తుకు సంబంధించి 1988 డిసెంబరు 28న న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ ఎన్‌డీ పట్నాయక్ 1988 ఏప్రిల్ 29న న్యాయమూర్తిగా రాకముందే ఉత్తర్వులు జారీచేసినట్టు నకిలీ పత్రాలు సృష్టించారు. దీనిపై విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని కోర్టు రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. కోర్టు రికార్డుల్లో అసలు పిటిషనే లేదని, ఆ నంబరుతో ఎలాంటి ఫైలు లేకపోయినా నకిలీ ఉత్తర్వులు సృష్టించారని తెలుపుతూ రిజిస్ట్రార్ నివేదిక సమర్పించారు. గతంలో కూడా ఇలా నకిలీ ఉత్తర్వులపై రెండు ఫిర్యాదులు ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నకిలీ ఉత్తర్వుల వ్యవహారంలో బాధ్యులపై చర్య తీసుకొనేందుకు పోలీసులకు ఫిర్యాదు చేయాలని ధర్మాసనం రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ ఫిర్యాదుతోపాటు ఇప్పటికే నమోదైన రెండు ఎఫ్‌ఐఆర్‌లపై వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తిచేయడానికి సిట్ ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అప్పటివరకు శంషాబాద్‌లోని భూములపై యథాతథస్థితి కొనసాగుతుందని స్పష్టంచేసింది.